రైతులంటే చిన్నచూపు



ఇటీవల వర్షాలు బాగా కురిశాయి. ఖరీఫ్ ఇప్పటికే ముగింపునకు చేరుకుంది. కూటమి ప్రభుత్వం రైతులకు ఇస్తామన్న రూ.20 వేల గురించి మరచిపోయింది. జగన్ సీఎంగా ఉన్నప్పుడు ఖరీఫ్ ప్రారంభానికి ముందే రైతు భరోసా పేరుతో సాయం ఇచ్చేవారు. ఈ ప్రభుత్వానికి రైతులంటే చిన్న చూపు.

–తమ్మిన సీతారమణ, టి.నగరపాలెం

ఉచిత బస్సు మాటేంటి?



ఎన్నికల సందర్భంగా కూటమి ప్రభుత్వం మహిళందరికీ ఉచిత బస్సు ప్రయాణం అని చెప్పింది. కానీ ఎప్పటికప్పుడు వాయిదా వేస్తూ వెళ్తున్నారు. కేవలం ఎన్నికల కోసమే అమలు చేయలేని హామీ ఇచ్చారని స్పష్టమైంది. మరోమారు చంద్ర బాబు మాయలో చిక్కుకున్నామని అర్థం అయింది. ఇప్పటికైనా ఆ పథకం అమలు చేయాలి.

– రంగూరి లక్ష్మి, చిట్టివలస

ఫీజులు కట్టడం కష్టమవుతోంది



మా ఇద్దరు పిల్లలు ప్రైవేట్ స్కూల్లో చదువుతున్నారు. కూటమి ప్రభుత్వం హామీ ప్రకారం ఇద్దరు పిల్లలకు రూ.30 వేలు వస్తుంది, స్కూల్ ఫీజులకు ఇబ్బంది ఉండదు అనుకున్నాం. అధికారంలోకి వచ్చి నెలలు గడిచినా ఆ హామీ అమలు చేయలేదు. ఫీజులు కట్టడం కష్టంగా ఉంది. గత ప్రభుత్వంలో అమ్మ ఒడి పేరుతో ప్రతి సంవత్సరం రూ. 15వేలు వచ్చేది. ఇప్పటికైనా హామీ నెరవేర్చాలి.

– రాంభుక్త దేవి, గృహిణి, భీమిలి

ఉద్యోగం.. లేదా భృతి ఇవ్వండి



సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా ఏటా 20 లక్షల ఉద్యోగాలు లేదా నిరుద్యోగులకు నెలకు రూ.3వేలు భృతి చెల్లిస్తామన్నారు. అధికారం చేపట్టి 100 రోజులు అవుతున్నా కూటమి ప్రభుత్వం ఎక్కడా దీని గురించి మాట్లాడటం లేదు. నిరుద్యోగులకు ఇస్తామన్న భృతి ఇవ్వకపోతే తిరగబడతారు. ఆ పరిస్థితి రాకముందే పథకం అమలు చేస్తే మంచిది.

– మేరుగు రాజు, నిరుద్యోగి, మంగమారిపేట

ప్రతి నెలా రూ.1500 ఇవ్వాల్సిందే



18 నుంచి 59 ఏళ్ల లోపు మహిళలకు నెలకు రూ.1500 ఇస్తామని కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ ద్వారా ఎన్నికల ప్రచారంలో హోరెత్తించింది. అధికారంలోకి వచ్చిన తరువాత ఆ విషయాన్నే మరచిపోయింది. దీంతో మహిళలలో ఆలోచనలు మొదలయ్యాయి. కూటమి ప్రభుత్వం అర్హులైన మహిళలకు కచ్చితంగా నెలకు రూ.1500 ఇవ్వాల్సిందే.


– కిరంశెట్టి పార్వతి, తగరపువలస

'తల్లికి వందనం'లో జాప్యమెందుకు?



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే తల్లికి వందనం పథకం ద్వారా ఎంతమంది పిల్లలు స్కూల్‌కు వెళ్తే అందరికీ రూ. 15వేలు వంతున ఇస్తామన్నారు. వైఎస్ జగన్ సీఎంగా ఉన్నప్పుడు చెప్పిన మాట ప్రకారం ఏడాదికి రూ.15వేలు తల్లుల ఖాతాలకు జమ చేశారు. కూటమి ప్రభుత్వం నేటికీ ఆ హామీ అమలు చేయలేదు.

– వెంపాడ ఆదిలక్ష్మి



చంద్రబాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ

నమ్మి ఓట్లేశాం... నట్టేట ముంచొద్దు బాబూ...

హామీలన్నీ అమలు చేయండి

నీకు రూ.15 వేలు... నీకు రూ.15 **వేలు.. నీకు.. నీకు .. ఇంట్లో ఎందరు పిల్లలు** చదివితే అందరికీ తల్లికి వందనం **పేరుతో రూ.15 వేలు చొప్పున అందజేస్తాం..** అమ్మకు నెలకు రూ.1500 చొప్పున **ఏడాదికి రూ.18 వేలు బ్యాంకు ఖాతాలోనే** వేసేస్తాం... మీ ఇంటికి మూడు సిలిండర్లు ఉచితంగా ఇచ్చేస్తాం... మీ ఇంట్లో మహిళలందరికీ ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తాం... మీ ఇంట్లో చదువుకున్న నిరుద్యోగులుంటే ఉద్యోగం వచ్చే వరకు నిరుద్యోగభృతి చెల్లిస్తాం... రైతులందరికీ అన్నదాత సుఖీభవ పేరుతో ఏడాదికి రూ.20 వేలు చొప్పున అందజేస్తాం... అధికారంలోకి రాగానే ఈ సూపర్ సిక్స్ పథకాలన్నీ **పక్కాగా అమలు చేసేస్తాం అంటూ ఎన్నికల సమయంలో ఇంటింటిప్రచారంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఊదరగొట్టారు... కూటమి నాయకులు చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌తో సహా స్థానిక ఎమ్మెల్యే అభ్యర్థి గంటా** శ్రీనివాసరావు మాయా మేనిఫెస్టోను ప్రజలకు చూపించి ఓట్లు అభ్యర్థించారు.. ఆ హామీలన్నీ నమ్మిన జనం ఓట్లేసి అధికారం కట్టబెట్టేసరికి... పథకాలు అమలు చేయాలంటే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సహకరించడం లేదని చేతులెత్తేస్తుండడం గమనార్హం... ఖరీఫ్ సీజన్ పూర్తి కావస్తున్నా పెట్టుబడి సాయం కోసం అన్నదాతలు... స్కూళ్లు తెరిచి మూడు నెలలవుతున్నా రూ.15 వేల సాయం **కోసం తల్లులు ఆశగా ఎదురు చూస్తున్నారు. గత ఐదేళ్లలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హామీలన్నీ పక్కాగా అమలు చేశారని... ఆర్థికంగా అండగా నిలిచారని లబ్ధిదారులు గుర్తు చేసుకుంటున్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి** చంద్రబాబు నాయుడు మాత్రం అందుకు పూర్తి భిన్నమని... నమ్మిన జనాన్ని మోసం చేయడం బాబుకు వెన్నతో పెట్టిన విద్య అని నియోజకవర్గ వాసులు అంటున్నారు. బాబు ష్యూరిటీ ఇస్తే... గ్యారెంటీ లేదని నిట్టూరుస్తున్నారు.

– తగరపువలస/భీమిలి/మధురవాడ/ కొమ్మాది/ పద్మనాభం



చదువుకునే పిల్లలందరికీ తల్లికి వందనం అమలు చేస్తామని ఎన్నికల సమయంలో గంటా శ్రీనివాసరావు చేసిన ప్రచారం క్లిప్పింగ్

ప్రతి రైతుకు ఏడాదికి రూ.20 వేల పెట్టుబడి సాయం



టీడీపీ పాలనలో ఒక్కో ఏడాదికి రైతుకు అందాల్సిన సాయం

నియోజకవర్గంలో అర్హులైన రైతులు

25,300

అందించాల్సిన 'అన్నదాత సుఖీభవ' సాయం

రూ.50.60 కోట్లు

ప్రతి మహిళలకు నెలకు రూ.1500



నియోజకవర్గంలో 18 ఏళ్లు నిండిన మహిళలు

1,61,908

అందరికీ నెలకు అందించాల్సింది

రూ.24.28 కోట్లు

ప్రతి ఇంటికి ఉచితంగా ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లు



గ్యాస్ కనెక్షన్లు

72,565

ఏడాదికి ఇవ్వాల్సిన సిలిండర్లు

2,17,695

ఏడాదికి ఇవ్వాల్సిన సాయం

రూ.17.65 కోట్లు

ప్రతి తల్లికి రూ.15 వేలు తల్లికి వందనం



టీడీపీ పాలనలో ఒక్కో ఏడాదికి తల్లికి అందాల్సిన సాయం


స్కూళ్లకు వెళ్తున్న విద్యార్థులు

60,000

అందించాల్సిన 'తల్లికి వందనం' సాయం

రూ.90 కోట్లు

యువతకు నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి




అర్హులైన నిరుద్యోగులు **43000**

నెలకు అందించాల్సిన నిరుద్యోగ భృతి

రూ.12.90 కోట్లు

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం



ఉచిత బస్సు ప్రయాణానికి అర్హులు

2.06 లక్షల మంది

పెట్టుబడి సాయం ఏదీ?



ఖరీఫ్ సీజన్‌లో వరి పంట వేసి రెండు నెలలవుతోంది. టీడీపీ అధికారంలోకి వస్తే పంటల సాగుకు రూ. 20వేలు ఇస్తామని హామీ ఇచ్చింది. ఇంతవరకు పెట్టుబడికి డబ్బులు ఇవ్వలేదు. డబ్బులు అప్పు తెచ్చి పెట్టుబడి పెట్టాం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అన్న సమయానికి ఏటా రైతు భరోసా ఇచ్చి ఆదుకునేది. ప్రస్తుత ప్రభుత్వం హామీ నిలబెట్టుకోవాలి.

– కె.శ్రీను, రైతు, గెద్దపేట

ప్రభుత్వ సాయం కోసం చూస్తున్నాం



ఎన్నికల్లో టీడీపీ నాయకులు 18 సంవత్సరాలు నిండిన మహిళలకు నెలకు రూ 1500 ఇస్తామని హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చి వందరోజులు అవుతున్నా కూటమి ప్రభుత్వం కనీసం పట్టించుకోకపోవడంతో ఆందోళనగా ఉంది. ఎప్పుడు హామీ నెరవేరుస్తారా అని ఎదురు చూస్తున్నాం. అది అమలైతే కుటుంబాలకు ఎంతో కొంత చేయూతగా ఉంటుందని చూస్తున్నాం.

– కె.భాను, గృహిణి, మధురవాడ

సిలిండర్ల కోసం చూస్తున్నాం



ప్రతి ఇంటికి ఏడాదికి ఉచితంగా మూడు సిలిండర్లు ఇస్తామని కూటమి నాయకులు హామీ ఇచ్చారు. స్థానికంగా కూడా పెద్ద ఎత్తున ప్రచారం కూడా చేశారు. దీంతో పేదలంతా ఈ సిలిండర్ల గురించి ఎదురు చూస్తున్నారు. అధికార పార్టీ నాయకులు ఇప్పుడు దీపావళి నుంచి ఇస్తామంటున్నారు. ఆ మాట నిలబెట్టుకోవాలి.

– బాడితబోయిన లక్ష్మి, పాత పీఎం పాలెం

'తల్లికి వందనం' లేనట్టేనా..?



కూటమి ప్రభుత్వం ఏర్పడగానే చదువుకునే పిల్లలందరికీ రూ.15 వేల చొప్పున 'తల్లికి వందనం' పేరుతో అందిస్తామని హామీ ఇచ్చారు. పాఠశాలలు ప్రారంభమై నెలలు గడిచినా ఆ పథకం అమలుపై స్పష్టంగా చెప్పట్లేదు. ఆ డబ్బులు వస్తాయని పిల్లలను ప్రైవేటు స్కూళ్లలో చేర్పించాం. స్కూళ్ల యాజమాన్యాలు ఫీజుల కోసం ఒత్తిడి చేస్తున్నాయి. పథకం అమలు చేయకపోతే ఫీజులు చెల్లించుకోవడం కష్టంగా ఉంటుంది.

– డి.అప్పలనాయుడు, భీమిలి

నిరుద్యోగుల కడుపుకొట్టొద్దు



సూపర్ సిక్స్ హామీల్లో నిరుద్యోగులకు భృతి చెల్లిస్తామని కూటమి నాయకులు ఎన్నికల సమయంలో ఇంటింటికీ ప్రచారం చేశారు. ప్రభుత్వం ఏర్పడి వంద రోజులవుతున్నా ఆ పథకం అమలుపై ఎవరూ స్పష్టత ఇవ్వడం లేదు. అసెంబ్లీ సమావేశాల్లోనూ హామీల అమలుపై చర్చించకపోవడం చాలా బాధాకరం. ఇచ్చిన హామీని నెరవేర్చకపోతే రాష్ట్రంలో నిరుద్యోగులు అందరూ తిరగబడతారు.

– వేముల ఈశ్వర్‌రెడ్డి, కాపులుప్పాడ

ఉచిత ప్రయాణం ఎప్పటి నుంచి ?



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళలకు ఫ్రీ బస్సు సదుపాయం కల్పిస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చారు. అధికారం చేపట్టి వంద రోజులవుతున్నా ఆ పథకం అమలు చేయలేదు. బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం కల్పిస్తే పేద, మధ్యతరగతి మహిళలకు ఆర్థిక భారం తగ్గుతుంది. త్వరితగతిన ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలి.

– టి.రమణమ్మ, భీమిలి

శరన్నవరాత్రి ఉత్సవాలకు రాట



చిప్పాడలో ఉత్సవరాట వేస్తున్న ఉత్సవ కమిటీ ప్రతినిధులు

తగరపువలస: శరన్నవరాత్రి ఉత్సవాల కోసం భీమిలి మండలం టి.నగరపాలెం, చిప్పాడ గ్రామాల్లో బుధవారం రాట వేశారు. టి.నగరపాలెం పంచాయతీ కొత్తూరులో శ్రీ ఎల్లారమ్మ యూత్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ పొట్నూరు ఛాయాగౌతమి పాల్గొన్నారు. చిప్పాడలో జరిగిన కార్యక్రమంలో మహిళలు, యువకులు పాల్గొన్నారు.

రేవళ్లపాలెంలో అన్న సమారాధన

మధురవాడ: వరసిద్ధి వినాయక నవరాత్రులను పురస్కరించుకుని 6వ వార్డు రేవళ్లపాలెంలో విఘ్నేశ్వర సేవాసంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపం వద్ద బుధవారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. సుమారు 5 వేల మంది అన్నప్రసాదం స్వీకరించారు.

ఎస్‌ఐ గౌరి బాధ్యతల స్వీకరణ

భీమునిపట్నం: భీమిలి పోలీస్‌స్టేషన్‌కు కొత్తగా వచ్చిన మహిళా ఎస్‌ఐ ఎస్.గౌరి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఎండాడ మహిళా పోలీస్ స్టేషన్ నుంచి ఆమె ఇక్కడికి బదిలీపై వచ్చారు. కాగా, ఇక్కడ పనిచేసిన ఎస్‌ఐ పైడిరాజు విశాఖ రేంజ్‌కు బదిలీ అయ్యారు.



బాధ్యతలు స్వీకరించిన ఎస్‌ఐ గౌరి

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

భీమునిపట్నం: ఇటీవల ఏలూరులో జరిగిన నేషనల్ ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో భీమిలి సమీపంలోని దొరతోటవద్ద గల నవజీవన్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ చూపారు. పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న టి.కౌశల్ కాటా, కుమిటే విభాగాల్లో స్వర్ణ పతకాన్ని గెలుచుకున్నాడు, జాన్సన్ కాటాలో స్వర్ణం, హార్థిక్ కుమిటేలో రజతం, కాటాలో కాంస్య పతకాలు సొంతం చేసుకున్నాడు. శాశ్వత్ బాలు కాటాలో రజతం, శ్యాం కాంస్య పతకాలు కైవసం చేసుకున్నారు. ఐదో తరగతి చదువుతున్న సోమసుందర్ కాటాలో కాంస్య పతాకాన్ని గెలుచుకున్నాడు. ఈ మేరకు పాఠశాల వద్ద జరిగిన కార్యక్రమంలో కరస్పాండెంట్ హెలెన్ జాన్సన్ టైటస్, ప్రిన్సిపాల్ లియా ఎలిజబెత్ సామ్, కోచ్ సాయికుమార్ వారిని అభినందించారు.



గెలుచుకున్న కప్‌తో విద్యార్థులు

బోధనా సామర్థ్యాలను పెంపొందించుకోవాలి

భీమునిపట్నం: ఉపాధ్యాయులు తమ బోధన సామర్థ్యాలను పెంపొందించుకోవాలని మండల విద్యాశాఖాధికారి ఎం.శివరాణి అన్నారు. అప్పుడే విద్యార్థులకు సులభరీతిలో అర్థమవుతుందన్నారు. స్థానిక పొట్టి శ్రీరాములు మున్సిపల్ ఉన్నత పాఠశాల వద్ద మండల పరిధిలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు బోధనా సామర్థ్యాలపై బుధవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. విద్యార్థులకు ప్రస్తుతం బోధిస్తున్న విధానంలో కొన్ని మార్పులు చేసి, మరింత అర్థమయ్యే విధంగా బోధించాలని సూచించారు. అలాగే సరిగ్గా చదవని విద్యార్థుల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. అలాగే, వారి తల్లితండ్రులకు తమ పిల్లల చదువు గురించి తెలియజేసి, అవసరమైన సహకారం తీసుకోవాలన్నారు. రిసోర్స్ పర్సన్‌లు రెడ్డిపల్లి అప్పలరాజు, చప్పా అమర్‌నాథ్, పువ్వుల శ్రీనివాస్ పాల్గొన్నారు.



శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు

వరద బాధితులకు వస్త్రాల పంపిణీ

తగరపువలస: భీమిలికి చెందిన దాతల సాయంతో స్థానిక యువకులు రెండు రోజులుగా విజయవాడలో వరద బాధితులకు దుప్పట్లు, టవల్స్, లుంగీలు పంపిణీ చేశారు. వానపల్లి సత్యనారాయణ, డొంకర అప్పలనారాయణ, ఇమంది సోమేష్ తదితరులు ఈ సేవా కార్యక్రమంలో పాల్గొన్నారు. మొత్తం 450 కుటుంబాలకు వీటిని అందించారు. జక్కంపూడి కాలనీ, అజిత్‌సింగ్ నగర్, గంగానమ్మ గుడి చివరి మసీదురోడ్డు, 71వ బ్లాక్, మైలవరం మండలం వేమవరం ప్రాంతాల్లో బాధితులకు వస్త్రాలు అందించారు. వీటిని భీమిలి జోన్‌కు చెందిన ఆదిమూల నాగరాజు, జగుపల్లి ప్రసాద్ నాగోతు రమేష్, మాల్యాద్రి, కారంపూడి కృష్ణమూర్తి, తుమ్మ సత్యప్రకాష్, కాపు సూర్యకుమారి, చెల్లూరి నాని, శేఖరమహంతి దుర్గా, గరే సదానంద, గుగ్గిళ్ల రమేష్, బడిగంటి మహేష్, కనకల అప్పలనారాయణ తదితరులు సమకూర్చారు.

కొత్త లా పుస్తకాల అందజేత



కొత్త లా పుస్తకాలను అందిస్తున్న జడ్జీలు

భీమునిపట్నం: కొత్తగా అమల్లోకి వచ్చిన లా పుస్తకాలను భీమిలి న్యాయవాదుల సంఘానికి ప్రిన్సిపల్ జూనియర్ జడ్జి కోర్టు జడ్జి పి.నాగేశ్వరరావు, రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు జడ్జి సౌజన్య అందించారు. రూ. 25 వేలు విలువ గల ఈ పుస్తకాలను వారి సొంత ఖర్చుతో కొనుగోలు చేసి అందజేశారు. వాటిని న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు ఎంవీ పార్వతీశం, కార్యదర్శి కేఎస్ఎం సుధాకర్, న్యాయవాదులకు అందజేశారు. వారు న్యాయమూర్తులకు కృతజ్ఞతలు తెలి పారు. జూనియర్ న్యాయవాదులెవరైనా మేజిస్ట్రేట్ పరీక్షలకు హాజరైతే, వారికి కోచింగ్ మెటీరియల్ అందిస్తామని జడ్జీలు ప్రకటించారు.

పీఎంఏవై ఇళ్ల పరిశీలన



గిడిజాలలో లే అవుట్‌ను పరిశీలిస్తున్న గృహనిర్మాణ శాఖ ఎండీ రాజాబాబు

తగరపువలస: రాష్ట్ర గృహనిర్మాణ శాఖ ఎండీ రాజాబాబు జిల్లాలోని ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకంలో చేపడుతున్న ఇళ్ల నిర్మాణాలను బుధవారం పరిశీలించారు. ఆనందపురం మండలం తంగుడుబిల్లి, గిడిజాల, జగన్నాధపురం, ముదపాక, గొల్లలపాలెం పరిధిలో లే అవుట్లను పరిశీలించారు. ఇప్పటి వరకు జరిగిన నిర్మాణాలు, జియో ట్యాగింగ్, లబ్ధిదారుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇటీవల జిల్లాలో జరిగిన సమావేశంలో తీసుకున్న నిర్ణయాల గురించి జిల్లా పీడీ అఖిల వివరించారు. ఆయన వెంట ఈఈ సత్యనారాయణ తదితరులున్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తగరపువలస: చిట్టివలస 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో నిర్వహణ, చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఈఈ పి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ కారణంగా జీవీఎంసీ పరిధిలో తగరపువలస మెయిన్‌రోడ్డు, చిట్టివలస, కొత్తపేట, సంతపేట, కొండపేట, బంగ్లామెట్ట, గణేష్ థియేటర్ రోడ్డు, ఆదర్శనగర్, సప్తగిరి లే అవుట్, జ్యూట్‌మిల్లు క్వార్టర్స్ లైన్ , రామన్నపేట, చిల్లపేట, జీరుపేట, ఊళ్లపేట, సంగివలసలో విద్యుత్ నిలిపివేస్తామని పేర్కొన్నారు. అలాగే భీమిలి మండల పరిధిలో తాటితూరు, టి.నగరపాలెం, మజ్జివలస, శింగనబంద, లక్ష్మీపురం, విజయరాంపురం, నారాయణరాజుపేట పంచాయతీల్లో పైన తెలిపిన సమయంలో అంతరాయం ఉంటుందని తెలియజేశారు.

పద్మనాభం పరిధిలో..

పద్మనాభం: పద్మనాభం 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని రెండు ఫీడర్లకు మరమ్మతులు చేపట్టనున్నందున సంబంధిత గ్రామాల్లో శుక్రవారం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని జోన్-3 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఆపరేషన్స్) పోలాకి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. పద్మనాభం టౌన్ పరిధిలో పద్మనాభం, ఇసకలపాలెం గ్రామాలకు, రేవిడి ఫీడర్ పరిధిలో రేవిడి, బర్లపేట, పాండ్రంగి, కొండ బర్లపేట, పాండ్రంగి గ్రామాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ప్రకటనలో తెలిపారు.

పీఎం పాలెం పరిధిలో..

పీఎం పాలెం: స్థానిక 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11కేవీ మొగదారమ్మ ఫీడర్, 11కేవీ ధర్మపురి ఫీడర్ పరిధిలో నిర్వహణ పనులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని జోన్-3 ఈఈ (ఆపరేషన్స్) పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. ఏపీహెచ్‌బీ ఉడా కాలనీ, పాత మధురవాడ మెట్ట, కుషి షాపింగ్‌మాల్ ఏరియా, మొగదారమ్మ బ్లాక్స్ ఏరియా, ధర్మపురి కాలనీ, సుందర్ నగర్, పీర్‌లెస్ కాలనీ, తారకరామనగర్ తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని తెలియజేశారు.

సీబీఎస్ఈ క్లస్టర్ అథ్లెటిక్స్‌లో మెరిసిన విద్యార్థులు

కొమ్మాది: ఇటీవల తెలంగాణలోని నల్గొండ జిల్లాలో జరిగిన సీబీఎస్ఈ క్లస్టర్-7 అథ్లెటిక్స్‌లో భీమిలి విజ్ఞాన్ వరల్డ్ వన్ స్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనపరిచారు. బాలురు అండర్-14, అండర్-17 విభాగాలలో పలువురు బంగారు, కాంస్య పతకాలు సాధించారు. ఈ పోటీలలో 4x100 మీటర్ల రిలే రన్నింగ్‌లో ఈ పాఠశాల విద్యార్థులు బంగారు పతకాలు సాధించి వారణాశిలో జరగనున్న జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అలాగే హైజంప్‌లో కె.నాగచరిత, 1500 మీటర్ల రన్నింగ్‌లో బిల్వజ్ఞ ప్రసిల్, 800 మీటర్ల రన్నింగ్‌లో ఎలీషా జోయల్ కాంస్య పతకాలు సాధించారు. 4 x 400 మీటర్ల రన్నింగ్‌లో కాంస్యం సాధించారు. ఈ సందర్భంగా పాఠశాలలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చైతన్య విజేతలను అభినందించారు.



పతకాలు సాధించిన విద్యార్థులు